కథానిక

# కారు మేఘం



ఎం. తారాదేవి.

ఆకాశం మేఘావృతమై వర్షం పడే సూచన కనిపిస్తుంది. గార్డెన్ చైర్లో కూర్చుని కిటికీలోంచి చూస్తున్న సుధ మనసు అలానే ఉంది. ముసురు పట్టిన మబ్బులా! ఆమె మనసులో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్న భావన, మనుషు లంటే అసహ్యం కలుగుతుంది. ఎంతో నమ్మకంగా ఉండి ద్రోహం, కుట్రలు, కుహకాలు చేసే మనుషులు ఈ సమాజంలో ఎందరో ఉంటారని తెల్సు, కాని అలాంటి మనుషులు జీవితంలో తటస్థపడటం ఆమె దురదృష్టం. ఎంతో ఆనందంగా అందరి ఆడపిల్లలాగానే కోటి కోరికలతో సంతోషంగా అత్త గారింట్లో అడుగు పెట్టింది. ఆ ఇంట్లోని మనుషులు వారి మనస్తత్వాల గురించి అర్థం చేసుకోవటానికి ఆమెకి ఈ జీవితం చాలదనిపించింది. అసలు పైకి ఎంతోమంచివారిలా కనిపిస్తారు, నలుగురికి అత్తగారైతే మరీనూ. ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఉన్నప్పుడు ఒక రకంగా, ఎవ్వరూ లేని సమయంలో మరోరకంగా ఎంతో చాకచక్యంగా నటిస్తుంది.సుధకి చాలా ఆశ్చర్యం కలుగుతుంది.

ఆమెకి ఇరవైరెండు సంవత్సరాలు. కుందనపు బొమ్మలా రవివర్మ చిత్ర పటంలా, బాపుగీసిన బొమ్మలా ఎవ్వరూ ఒంక పెట్టలేని అందం. సుధకి ఆమె మేనత్తకొడుకు సురేష్‌తో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. వాళ్ళు అడిగిన కట్నకానుకలు సమర్పించి మరో వివాహం గ్రాండ్‌గానే జరిపించాడు శ్రీనివాసరావు. పెళ్ళి జరిగిన నెల తర్వాత అనుకుంటాను దీపావళి పండుగ దగ్గరకు వస్తుందని కూతుర్ని, అల్లుడిని పండక్కి తీసుకురమ్మని భార్యని పంపాడు. తనకి వీలు దొరకని కారణంగా రెండు రోజుల అనంతరం కూతురితో తిరిగి వచ్చిన భార్యను చూస్తూ "అల్లుడుగారు రాలేదా"? అన్నాడు. ఆశ్చర్యంగా, "అబ్బాయి సంక్రాతికి వస్తానన్నాడండీ ఇప్పుడు మాల వేసుకుంటున్నాడట. అయ్యప్ప స్వామి దగ్గరికి శబరిమలై వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత వస్తానని చెప్పమన్నాడు".

అల్లుడు శబరిమలై వెళ్తున్నందుకు సంతోషించి, ఎంతైనా చిన్నల్లుడికి భక్తి ఎక్కువే అని మనసులో మురిసిపోయాడు. సంక్రాతి వెళ్ళింది కాని సురేష్ రాలేదు. అల్లుడుగారు ఎందుకు రాలేదో! ఏమి పనులు పడినాయోనని, అమ్మాయిని తీసుకు వెళ్ళి దిగబెట్టాలనే ఉద్దేశ్యంతో బావగార్కి ఉత్తరం రాసారు అమ్మాయిని పంపుతున్నట్లు.

అంతే తిరుగు టపాలో ఉత్తరం వచ్చింది. మీ అమ్మాయిని మా ఇంటికి పంపొద్దు, ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడుంటున్న మా పరువు తీసింది. మమ్మల్ని తలెత్తుకోలేకుండా చేసింది. అని ఎన్నో ఆరోపణలతో ఆ ఉత్తరం చదివిన శ్రీనివాసరావు గుండె దహించుకు పోయింది. శూలాలతో పొడిచినట్లు స్వయంగా ఆయన అక్కగారు, సుధకి మేనత్త అని వాళ్ళకిస్తే కూతురు సఖపడుతుందని అనుకున్నారు. కాని ఇలా!? "సుదా ఏమిటమ్మా! ఇది, ఏం జరిగింది"? అడిగాడు కూతుర్ని. జరిగిన విషయం ఎలా చెప్పాలా అని ప్రశ్నార్థకంగా చూసింది తండ్రి ఒంక. ఆమె కళ్ళల్లో సన్నని నీటి పొర... అత్తగారింట్లో జరిగిన సంఘటనలు ఆమె హృదయంలో మెదిలాయి. "సుధా! అమ్మ ఏం చేస్తుంది?" పొంద్రి నుంచి రావటంతోనే అడిగాడు సురేష్. ఆ ఇంట్లో ఏప్పుడు ఏ సంఘటన జరుగుతుందో, ఎవరికి ఏ స్వల్ప విషయానికి గొడవ మొదలవుతుందోననే ఆందోళనతో ఉంటాడు సురేష్. వాళ్ళమ్మంటే చాలా భయం. చిన్నతనం నుంచి అలానే పెరిగాడు. సురేష్ అన్నయ్య సతీష్ భార్యతో వేరే కాపురం పెట్టాడు. అందుకు కారణం అత్తగారు, మరుదులు కల్సి క్రొత్తగా వచ్చిన ఆమెని ఎంతగానో వేధించారు, ఇంకా కట్నం తీసుకురమ్మని. కావ్య చదువుకున్నది కావటంతో తండ్రి కూడా ఆ ఊళ్ళోనే జాబ్ చేస్తుండటంతో ఆయన ప్రోద్భలంతో ధైర్యం చేసి కలక్టర్ గార్కి ఫిర్యాదు చేసింది. అప్పుడు నెల్లూరు జిల్లాకి లేడి కలక్టర్ అవడం మూలాన వెంటనే యాక్షన్ తీసుకుని అత్తగార్ని, మామగార్ని అందర్ని ఒక రోజు అంతా కష్టడీలో ఉంచటం జరిగింది. అప్పట్నుంచి పెద్దకొడుకు, కోడలు వేరే వుంటున్నారు. అది ఇప్పుడు అప్రస్తుతం కాని, సతీష్ అప్పడప్పుడు వారి ఇంటికి రావటంతో మొదలవుతుంది గొడవ.

ఒకరోజు సురేష్ చాలా బాధపడుతూ "సుధా నేను చచ్చిపోతాను. ఆత్మ హత్య చేసుకుంటాను". అనేసర్కి ఆమెకి చాలా భయం వేసింది. ఏం చేయాలో అర్థం కాలేదు. అత్తగారితో చెప్పాలంటేనే భయం. ఆమెతో మాట్లాడాలంటేనే కాళ్ళు వణుకు. అందుకే తమ వాటాలోనే ప్రక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న రమతో చెప్పింది. "ఏమిటోనండి ఆయన నేను చచ్చిపోతానంటున్నారు. నాకు చాలా భయంగా వుంది"అని మాటల సందర్భంలో చెప్పింది ఉండబట్టలేక ఆందోళనగా ఉన్న మనసుతో. అంతే ఆ తర్వాత రమ వాళ్ళ అత్తగారితో చెప్పటంతో ఇంట్లో చాల పెద్దగొడవే జరిగింది. "నేనున్నాను కదా! నాతో చెప్పకూడదూ, ఇంటి విషయాలు బయటివాళ్ళకి చెప్పి రచ్చకెక్కుతావా? నేను అంతరాక్షసిలా కనిపిస్తున్నానా?" అంటూ చాలా గొడవ చేసింది. అది మొదలు కోడల్ని చీటికి • మాటికి సాధించటం మొదలు పెట్టింది. ఎప్పుడో కాల గర్భంలో కల్సిన పాత విషయాలు త్రవ్వుకొస్తూ "మీవాన్న నాకు తమ్ముడు, వాడూ, మాఅన్నయ్య నాకు పెళ్ళిచేసి వదిలేసారు. మా గురించి పట్టించుకోలేదు. ఈ నెల్లూరులో ఎన్ని అష్టకష్టాలు పడితే ఈ స్థితిలో ఉన్నానో నాకు తెలీదు".

**ఎప్పటికైనా బావ తనను తీసుకువెళ్తాడని ఎంతో ఆశగా ఎదురుచూసే సుధకి నిరాశే మిగిలింది. ఈ మధ్య అతను డైవర్స్ ఇవ్వకుండానే మరొకామెను వివాహం చేసుకున్నాడు.**

అయినా ఆమె అన్నదమ్ములు సరిగ్గా చూడక పోవటం సుధ తప్పా? సుధ జన్మించక ముందు జరిగిన విషయాలు ఆమెనడిగితే ఏం సమాధానం చెప్పగలదు? తనని సాధించటానికి సమయం సందర్భం ఇదేనని అత్తగారి ఉద్దేశమా? సుధకి అర్థం కాలేదు. అత్తగారింట్లో పట్టుమని రెండు మాసాలు కూడా ఉండలేదు. ఆ కొద్ది రోజుల్లోనే ఎన్నిబాధలు చవిచూసింది. అంతే సుధ పుట్టింట్లోనే ఉండిపోయింది.

ఎన్ని ఉత్తరాలు రాసినా ఒకటే జవాబు మీ అమ్మాయి మా ఇంటికి రావటానికి వీల్లేదని అందరూ కల్సి ఒకటేపాట. కట్టుకున్న భర్త వాళ్ళతో ఏకమయ్యేసరికి సుధ బాధ వర్ణణాతీతం. ఒక రోజు ధైర్యం చేసి వెళ్ళింది అత్తగారింటికి. ఎన్నాళ్ళని పుట్టినింట్లో ఉంటుంది, చూసేవాళ్ళకి బాగోదు. చుట్టుప్రక్కల వాళ్ళు కుతూహలంతో అడిగే ప్రశ్నలకి, ఆరాలకి సమాధానం చెప్పటం కష్టం.

"ఎందుకొచ్చావు ఇక్కడికి? ఇది నాయిల్లు. మా ఇంట్లో ఉండటానికి వీల్లేదు. వేరే కాపురం పెట్టుకోమని చెప్పానుగా, నాకొడుకుని మీకు అమ్మేసాను. వాడు వస్తే తీసుకెళ్ళండి. నాకభ్యంతరం లేదు. నా ఇంట్లో ఒక్క క్షణమున్నా నేను భరించలేను. వెళ్ళిపోండి ఇక్కడ్నుంచి."


అత్తమామలు కల్సి ఆమెసూటికేస్ గిరాటవేసి నిర్లక్ష్యణ్యంగా అర్ధరాత్రి అని చూడకుండా బయటకు నెట్టారు. ఆ సమయంలో సురేష్ ఇంట్లో లేదు. వెంటనే పోలీస్ రిపోర్ట్ ఇచ్చే ఆలోచన ఆమెకి రాలేదు. అంతటి పరిజ్ఞానం వారికి లేదు. సుధ, వాళ్ళ అమ్మగారు దిక్కుతోచని స్థితిలో ప్రక్కపోర్షన్ రమ ఇంట్లో ఆనైట్ ఉండి ఉదయానే బయలుదేరి ఇంటికి వచ్చేసారు.

పెరాలసిస్ స్ట్రోక్‌తో మంచం మీద ఉన్న శ్రీనివాసరావు గుండే చెరువయ్యింది. కూతురి దుస్థితి చూసి ఎంత ఆవేశమొచ్చినా, ఏమి చేయలేని నిస్సహాయ స్థితి. సుధ వచ్చి నెలరోజులు దాటిపోయింది. అత్తగారు నా ఇంట్లో వద్దని, భర్తచూస్తే రాడు, వేరే కాపురం పెట్టేది ఎలాగో అర్థం కాలేదు.

అసలు విషయం ఏమిటంటే సురేష్‌కి ఇంతకు ముందు చదువుకునే రోజుల్నుంచి ఇద్దరమ్మాయిలతో పరిచయాలున్నాయని, సుధని చేసుకోవడం ఇష్టం లేకపోయినా, తల్లిదండ్రుల బలవంతంతో ఆమె మెడలో మూడుముళ్ళు వేశాడు. పెళ్ళి అయితే చేసుకున్నాడు కాని, భార్యని ప్రేమగా పలకరించికాని, అభిమానంగా మాట్లాడి గాని ఎరుగడు. నాకీపెళ్ళి ఇష్టం లేదు అని ఒక చిన్న మాట చెబితే ఓ ఆడపిల్ల జీవితం నాశనం కాకుండా ఉండేది. ధైర్యంలేని మగాడు కట్టుకున్న భార్యని ఏడిపించటమే ధ్యేయంగా పెట్టుకుని, వేరే కాపురం పెట్టమంటే నాకాళ్ళమీద నేను నిలబడలేను, అని నీచాతి నీచమైన డైలాగ్ చెప్పేవాడు. పెళ్ళి చేసుకొనే ముందు తెలియదా? తనకాళ్ళమీద తాను నిలబడలేననే విషయం, సుధంటే ఇష్టం లేని విషయం. వివాహం జరిగిన తర్వాత కొద్దిరోజులు కాపురం చేసి నాకిష్టం లేదు అనడం ఎంతవరకు సమంజసంగా వుంటుంది?.

ఎప్పటికైనా బావ తనను తీసుకువెళతాడని ఎంతో ఆశగా ఎదురు చూసే సుధకి నిరాశే మిగిలింది. ఈ మధ్య అతను డైవర్స్ ఇవ్వకుండానే మరొకామెను వివాహం చేసుకున్నాడు. ఆ సంబంధం కుదిర్చింది స్వయానా పెద్దనాన్న. తమ్ముడి కూతురి జీవితం గురించి ఆలోచించకుండా చెల్లి కొడిక్కి వివాహం జరిపించిన ఆయనది ఎంతటి దయార్ద్ర హృదయం. ఆమె కళ్ళ వెంట కొన్ని కోట్ల అశ్రువులు జారి పోతున్నాయి. జాలిగా, చాలా దయనీయంగా వుంది ఆమెస్థితి. వివాహం జరిగి సంతోషంగా ఉండాల్సిన టైమ్‌లో ఆమె జీవితం అడవిగాచిన వెన్నెలగా మారింది. ఒకరి నిండు జీవితంతో మరొకరు ఆటలాడే అధికారం హక్కు ఎవరిచ్చారు? ఎందుకిలా జరిగింది? తప్పెవరిది? ఆమె ఉన్న స్థితిలో తిరిగి వివాహం జరగడం కష్టం సమాజంలో అభ్యుదయ బావాలుగల వ్యక్తులెవరైనా ముందుకొచ్చి ఆమెకి జీవితాన్ని ప్రసాదిస్తారేమో కాలమె నిర్ణయించాలి. సుధకి ఆమె స్వప్నం చెదిరినట్లుగా ఉంది. ఆకాశం ఘర్జించే సరికి కారుమేఘాలు క్రమ్మి వర్షం కురియసాగింది. ధారలుగా, వర్షధారల్లానే సుధ మనసులో బాధా పాచికలు ఆమె కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి.

◆



## కాకిగోల

కుంటుతూ కుంటుతూ అయినా
గమ్యం చేరాలనే
అంగవైకల్యం ఆనాడే జరిగింది.
అర్ధరాత్రి పతాక యెగరేసి
ఆవులించి కునుకేసిన వాడే.
ఉదయించిన కొత్తసూర్యుడు
వింత రుగ్మతలతో వెలవెలబోయినవాడే
ఆపోహల అంగీలు తొడిగి అన్నదమ్ములు
తల్లిని రెండు ముక్కలు చేసిన వాడే
అసహన జీవమలై సోదరులు
'హేరామ్' గుండెకునిప్పు పెట్టిన వాడే
శరీరానికేగదా అనుకొన్నాము
తరువాత్తరువాత
మనసు మొక్క ఆకులు తొడగడం మానేసింది
ఇక్కడ కోకిల జాతీయగీతం మరిచిపోయింది
అడ్డదారుల్లో కరెన్సీ తొడిగిన పడమంత్రపురెక్కలు
దొడ్డిదారుల్లో కుర్చీలకు మొలిచిన ముతకమీసాలు
కోరికల్లా లక్షల సంఖ్యలో పెరిగిపోయి
తల్లివిలువల పలువలు విప్పసాగాయి
సుయోధన సంతతి సృష్టించిన
స్వార్థం కత్తులకు, అహం గొడ్డళ్ళకు
పైశాచిక విభవానికి బెంబేలెత్తి
ఎన్నికల స్ప్రింగ్ పిప్పర్‌మెంట్లు చప్పరిస్తున్న దేశం.
ఎండిన ఈతచెట్లపై కాకులు అరుస్తున్నప్పుడు
చలనం సంచలనం చీప్ లిక్కర్ మనుష్యుల్లో
వివాదాల రోడ్లతో భయం భయంగా బజార్లు
ఎవడో అందించిన రాళ్ళతో కాకులపై జనందాడి
కాకుల్ని తరిమే అయోమయావేశం.
గోల... కాకుల గోల.. ఆగదు
బియ్యం కోసం బయలుదేరన మంది
అన్నమయ్య ఆశీస్సుకోసం గుంపులో గొర్రెలై.
కాకిగోల ఆగదు .

యస్.మునిసుందరం